క్లుప్తంగా

మండలస్థాయి క్రికెట్ విజేత కన్నాపురం జట్టు



విజేతగా నిలిచిన కన్నాపురం జట్టు సభ్యులు

కొయ్యలగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా మండల స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో కన్నాపురం -2 జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఫైనల్ పోరులో పరింపూడి-4 జట్టుపై 23 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా క్రీడాకారులను పలువురు అభినందించారు.

రాములోరి గ్రామోత్సవం



సీతారామచంద్రస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకొని ఏపుగుంట గ్రామంలో రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ ఎస్‌వీపీకేహెచ్ శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం రామాలయంలో సీతా రామచంద్ర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. అనంతరం స్వామి వారిని పల్లకీలో ఉంచి, మేళతాళాల నడుమ గ్రామో త్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాగర్‌బాబుకు సత్కారం



సాగర్‌బాబుని సత్కరించిన ఎంపీడీవో విజయ్‌ప్రసాద్

జంగారెడ్డిగూడెం రూరల్: ఐఆర్‌ఎస్ (ఇండియన్ రెవెన్యూ సర్వీస్) ఉద్యోగాన్ని సాధించిన జంగారెడ్డిగూడెం మండలం జొన్నవారిగూడెం గ్రామానికి చెందిన సాగర్‌బాబుని తాడువాయిలో శనివారం సత్కరించారు. ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్ సాగర్‌బాబుకి దుశ్శాలువా కప్పి సత్కరించారు. చదువుతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీవో విజయ్ ప్రసాద్ అన్నారు. సాగర్‌బాబు ఎంతో కష్టపడి చదవి ఉన్నత ఉద్యోగాన్ని సాధించడం అభినందనీయమన్నారు.

సమగ్ర ఓటర్ల జాబితా తయారీకి చర్యలు



రాజకీయ నాయకులతో నిర్వహిస్తున్న సమావేశం

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో రాజకీయ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ అద్దయ్య మాట్లాడుతూ సమగ్రమైన ఓటర్ల జాబితా తయారీపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే ఎన్నికల నిర్వహణకు ఆయా పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. తహసీల్దార్ ఎస్.శారాశాంతి, పలు మండలాలకు చెందిన తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు



సొంగా సందీప్

ఏలూరు (టూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తోన్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ నాయకుడు, లీడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ అన్నారు. శనివారం ఏలూరులోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందించే సంక్షేమాన్ని చూసి తట్టుకోలేని ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేయడం వారి సంస్కార హీనతకు నిదర్శనమన్నారు. రూ.400 కోట్లకు పైగా నిధులు వెచ్చింది భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాశిల్పాన్ని ఏర్పాటు చేసి సామాజిక న్యాయం చేస్తుంటే టీడీపీ నాయకులు విమర్శలు చేయడం తగదన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించడం ఖాయమని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దళితులకు రాజ్యాధికారం కల్పించడం తథ్యమని అన్నారు. దళితులకు రాష్ట్ర కేబినేట్‌లో హోంశాఖ, పురపాలక శాఖలు ఇచ్చిన ఘనత, సామాన్యులకు సీట్లు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఇతర పార్టీల్లో నోట్లకు సీట్లను అమ్ముకుంటున్నారని ఎద్దేవా చేశారు. చింతలపూడి నియోజకవర్గంలో ప్రతిపక్షంలో సీట్ల కోసం అనేక మంది పోటీ పడటం ఎన్నికలైన తర్వాత వారివారి స్థానాలకు వెళ్లి పోవల్సిందేనని సందీప్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో చింతలపూడిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



జంగారెడ్డిగూడెంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ఇంటి వద్ద పరిచయ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలతో వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు

జంగారెడ్డిగూడెం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. జంగారెడ్డిగూడెంలో శనివారం రాత్రి ఆయన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి సోంబాబు, పార్టీ ఏలూరు జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్ తదితరుల గృహాలకు వెళ్లి వారిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా వచ్చిన నాయకులు, కార్యకర్తల నుద్దేశించి విజయరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, ప్రతి పేదవాడికి ఒక అన్నగా, కుటుంబ పెద్దగా ఉంటూ వారి సాధక బాధలను తీర్చుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని, అటువంటి పాలన కొనసాగాలంటే మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌ను గెలపించాలన్నారు. ఈ సందర్భంగా నాయకులను, కార్యకర్తలను ఆయన పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, నాయకులు బత్తిన చిన్న, మానవత మూర్తి, కౌన్సిలర్‌లు, బూత్ కన్వీనర్‌లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి

జంగారెడ్డిగూడెం: పట్టణ సమస్యల పరిష్కారానికే మన ఊరు, మన వార్డు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని 2వ వార్డులో శనివారం మన ఊరు, మన వార్డు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణాన్ని ప్రజలకు అత్యంత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం కృషిచేస్తోందన్నారు. మున్సిపల్ అభివృద్ధికి కావాల్సిన చర్యలను తీసుకోవడంతో పాటు, అవసరమైన నిధులు సాధించేందుకు ఎప్పటికప్పుడు ప్రగతిని ప్రభుత్వానికి నివేదిస్తూ పట్టణాభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, ఆయన ఎన్నో కార్యక్రమాల ద్వారా రాష్ట్రాన్ని, ప్రజలను అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే జంగారెడ్డిగూడెం పట్టణంలో ఇప్పటికే సీసీ రోడ్డు, డ్రెయిన్‌లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రజలకు ఆహ్లాదాన్ని కల్పించేలా అక్కమ్మ కోనేరును సుందరీకరిస్తున్నామన్నారు. అయితే తమ దృష్టికి రాని, ప్రజలు తరచుగా ఎదుర్కొనే సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే చర్యల్లో భాగంగా మన ఊరు, మన వార్డు కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు. ఈ సందర్భంగా వార్డులో చైర్‌పర్సన్ కలియదిరుగుతూ ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, స్థానిక వార్డు కౌన్సిలర్ పెసరగంటి గంగ, ఏలూరు జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, కౌన్సిలర్‌లు ఉగ్గం దుర్గాప్రసాద్, నేకూరి కిషోర్, ఏపీ రమణమూర్తి, మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్, ఏఈ సంధ్య, మేనేజర్ వెంకటరమణ, పార్టీ నాయకులు బత్తిన చిన్న, పెసరగంటి త్రిమూర్తులు, కంచర్ల విష్ణు, చిప్పాడ వెంకన్న, షేక్ అక్బర్, గెద్దాడ శ్రీనివాస్, కె.ప్రకాష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

టి.నరసాపురం: పాడిరైతులు వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ కె.కోటేశ్వరరావు అన్నారు. స్థానిక పశు వైద్యశాల వద్ద శనివారం వైఎస్సార్ పశుబీమా పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు ప్రమాదవశాత్తు మరణిస్తే పశుపోషకులు ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన వున్న పాడి రైతులకు 80 శాతం, ఎగువన ఉన్న వారికి 50 శాతం ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తుందని, మిగిలిన ప్రీమియం పాడి రైతు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. మేలు జాతి పశువుకు రూ.30 వేలు, నాటు పశువుకు రూ.15 వేలు, గొర్రెలు, మేకలకు రూ.6 వేలు బీమా వర్తిస్తుందని ఆయన తెలిపారు. వివరాలకు రైతు భరోసా కేంద్రాలు, మండల పశు వైద్యశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



కోటనాగవరంలో వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు

బుట్టాయగూడెం: వచ్చే వేసవి దృష్ట్యా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని ముప్పినవారిగూడెం సచివాలయం సమీపంలో సుమారు రూ.29 లక్షల వ్యయంతో 40 వేల లీటర్ల కెపాసిటీ గల హైలెవెల్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి, అలాగే కోటనాగవరం గ్రామంలో సుమారు రూ.27 లక్షల వ్యయంతో 30 వేల లీటర్ల కెపాసిటీ గల హైలెవెల్ వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి బాలరాజుతోపాటు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా సాగు, తాగునీటి అవసరాలకు నీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కచ్చితమైన చర్యలు తీసుకోవాలి అన్నారు. అలాగే నియోజకవర్గంలోని గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు జలజీవన్ మిషన్ ద్వారా సుమారు రూ.350 కోట్ల వ్యయంతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో 170 వాటర్ ట్యాంక్‌లు సుమారు రూ.46 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పలుచోట్ల పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్ తెల్లం వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, ఉపసర్పంచ్ శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు తాళ్లూరి ప్రసాద్, తెల్లం చిన్నారావు, నక్కా శివాజీ, కుక్కల రాంపండు, తెల్లం దుర్గారావు, పంపన కృష్ణ, తాళ్లూరి వెంకటేశ్వరరావు, పంపన నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి: చింతలపూడి సబ్ జైల్‌ను జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు శనివారం సందర్శించారు. ఖైదీలకు చట్టాలపై అవగాహన కలిగించారు. క్షణికావేశాల్లో నేరాలకు పాల్పడివారు శిక్ష అనుభవించాక సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ హింసా మార్గాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. సబ్ జైల్‌లో ముద్దాయిలకు అందిస్తున్న ఆహారం, వసతి సదుపాయాలను గురించి జైలు అధికారులను ఆరా తీశారు. ఆర్థిక స్థోమత లేక, న్యాయవాదిని పెట్టుకోలేని వారి కోసం కోర్టు ద్వారా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. చెడు వ్యసనాలను విడనాడి కష్టపడి పని చేసి బతకాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బుల్లాసుపాదం, పింగుల డేవిడ్ రాజు, పారా లీగల్ వాలంటీర్ ఎండీ అక్బర్ అలీ, జైల్ సూపరింటెండెంట్ జి వెంకటేశ్వరరావు, సబ్ జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్కవరంలో అభివృద్ధి పనుల ప్రారంభం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని లక్కవరంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.7 లక్షలతో డ్రెయినేజీ, కల్వర్టు పనులకు సర్పంచ్ గెల్లా వెంకట రమణ, ఎంపీపీ కొదమ జ్యోతి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిపాలన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పగడం నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి, పార్టీ నాయకులు వందనపు సూర్యప్రకాషరావు, మల్లెల్లి సూర్యనారాయణ, దల్లి నాగేశ్వరరావు, నిమ్మ రామ కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం లక్కవరంలో ఇటీవల మృతి చెందిన దల్లి సింహాద్రి కుటుంబానికి రూ.10 వేల సహాయాన్ని సర్పంచ్ గెల్లా వెంకట రమణ, ఎంపీపీ కొదమ జ్యోతి చేతుల మీదుగా అందజేశారు. మట్టి ఖర్చుల నిమిత్తం ఈ ఆర్థిక సహాయం అందించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



సరిపల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం సరిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించారు. ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజాప్రతినిధులు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న సంక్షేమ, అభివృద్ధి చర్యలతో పేదరికం గణనీయంగా తగ్గింది అని గణాంకాలతో సహా వివరించారు. 75 ఏళ్లకుపైగా జరగని అభివృద్ధి పనులు స్వతంత్ర భారతావనిలో ఇప్పుడు సాక్షాత్కరిస్తున్నాయని పేర్కొన్నారు. సర్పంచ్ తాడేపల్లి గోపి, తపన ఫౌండేషన్ మండల సేవా ప్రతినిధి ఆరేటి ఏసుబాబు మట్ట సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర యువజన శాఖ ఆధ్వర్యంలో కుట్టుమెషీన్ శిక్షణ



కేంద్ర యువజన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమెషీన్ శిక్షణా కేంద్రం

కుక్కునూరు: యువతులు తమ కాళ్లపై తాము నిలబడేలా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని పాస్టర్ జాషువా పేర్కొన్నారు. శనివారం మండలంలోని కివ్వాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కేంద్రయువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో యువతులకు కుట్టుమెషీన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా మాట్లాడుతూ, యువతులు తమలోని స్కిల్‌ని డెవలప్‌మెంట్ చేసుకోవడం వలన ఆర్థికంగా ఎదగవచ్చని పేర్కొన్నారు. అంతేకాక ప్రతి ఒక్కరూ సమాజాసేవ అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం వలంటీర్ పెంకె సాగర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి నియోజకవర్గాన్ని జగన్‌కు కానుకగా ఇద్దాం



శ్రీనివాసపురంలో జరిగిన పరిచయ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో విజయరాజు

జంగారెడ్డిగూడెం రూరల్: రానున్న ఎన్నికల్లో చింతలపూడి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి, ఆ విజయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామని చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి నివాసంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో పరిచయ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ వై నాట్ 175 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇన్‌చార్జిల నియామకాన్ని చేపట్టారన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన కార్యక్రమాలే వైఎస్సార్‌సీపీ విజయానికి పునాది అన్నారు. అయినప్పటికీ ఎక్కడా అలసత్వం లేకుండా ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు వచ్చే ఎన్నికల్లో నూరుశాతం పార్టీ విజయానికి కృషిచేసేలా గురుతర బాధ్యతను నియోజకవర్గ ఇన్‌చార్జిలకు అప్పగించారన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. తాను స్థానికుడినని, ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి విజయసారధి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, పార్టీ నాయకులు మేడవరపు విద్యాసాగర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరుణ, త్యాగం.. నిజమైన క్రీస్తు మార్గం



ఆర్‌సీఎం చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న బిషప్ పొలిమేర జయరావు, పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త విజయరాజు

కామవరపుకోట: ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో క్రీస్తు మార్గం అనుసరించాలని రోమన్ క్యాథలిక్ మిషన్ ఏలూరు పీఠాధిపతులు పొలిమేర జయరావు అన్నారు. శనివారం రామన్నపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌సీఎం చర్చి ప్రారంభోత్సవానికి బిషప్ జయరావు, వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంభం విజయరాజు మాట్లాడుతూ పొరుగువారి పట్ల కరుణ, దయ, త్యాగం కలిగి ఉండటమే నిజమైన క్రీస్తు మార్గమని తెలిపారు. అనంతరం రామన్నపాలెంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలే, పార్టీని మరలా అధికారంలోకి తీసుకొస్తాయని ధీమా వ్యక్తం చేశారు. చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థిగా స్థానం కల్పించినందుకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల అండదండలతో భారీ మెజార్టీతో గెలిచి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఏఎంసీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, జెడ్పీటీసీ కడిమి రమేష్, సర్పంచులు రాయంకుల తులసి సత్యనారాయణ, కరిపోతు అనూష భాగ్యరాజ్, ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, ఉప్పలపాటి శ్రీను, అన్న పనేని రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

22న రామదూతల విజయోత్సవ ర్యాలీ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుందర బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం నుంచి ఈ నెల 22న మధ్యాహ్నం 2 గంటలకు రామదూతల భారీ ర్యాలీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అన్నప్రసాద వితరణ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్యలో జరుగుతున్న బాల రాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం పురస్కరించుకొని ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీనివాసరెడ్డికి పరామర్శ

జంగారెడ్డిగూడెం రూరల్: పేరంపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఇర్ల శ్రీనివాసరెడ్డిని శనివారం నాయకులు పరామర్శించారు. శ్రీనివాసరెడ్డి తండ్రి రాఘవరెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డిని పరామర్శించి, రాఘవరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా కార్యదర్శి కఠారి సీతారాంబాబు, నాయకులు బుడేకుల పాపారావు, మల్లా బత్తుల కృష్ణ చైతన్య, కర్రా భాస్కరరావు తదితరులు ఉన్నారు.

అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలో ఆయుధ కర్మాగారం ఏర్పాటుకు సంబంధించి గ్రామ సభకు వెళ్లిన తహసీల్దార్, ఇతర అధికారులను శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. కర్మాగారం పనులకు సంబంధించిన భూములు ఇవ్వడం కుదరదని వారు చెప్పారు. గ్రామసభలను రద్దు చేసి వెనుదిరిగి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. కాగా సమాచారం అందుకున్న పోలీసులు కారుకు అడ్డంగా ఉన్న గిరిజనులను పక్కకు తొలగించారు.

మంత్రి తానేటి వనితకు అభినందనలు



వనితకు పూల బొకేను అందిస్తున్న పార్టీ నేతలు రాజబాబు, తదితరులు

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనితను మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు శనివారం మధ్యాహ్నం తాడేపల్లిగూడెంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజబాబుతో పాటు పార్టీ నేతలు దాకారపు బంగారమ్మ, పసుపులేటి ఏసుబాబు, దాసరి ఏసురత్నం, ఉప్పల మునేశ్వరరావు, చెలికాని బుల్లియ్య, పోల్కంపల్లి అనీల్ బాబు, మల్లెపూడి నాగమణి, ఆచంట రాకేస్, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్ తదితరులు మంత్రి వనితకు పూల బొకేలను అందించారు. అలాగే బొండాడ వెంకన్నబాబుతో పాటు మరికొందరు వనితను కొవ్వూరులోని ఆమె క్యాంపు కార్యాలయంలో సాయంత్రం కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానుకొండ ప్రసాద్, మానుకొండ కన్నయ్య, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ములకాల పానకాలు, దాసరి రాంబాబు, యాచమనేని నాగేశ్వరరావు, భోగరాజు సాయి కృష్ణ, షేక్ మస్తాన్ బాషా, బోళ్ల శ్రీను, గంటా శేఖర్ తదితరులున్నారు.

బయ్యనగూడెం కన్వీనర్‌గా బాలం



పార్టీ బయ్యనగూడెం కన్వీనర్‌గా బాలం

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ బయ్యనగూడెం గ్రామ కన్వీనర్‌గా సీనియర్ నాయకులు బాలం వెంకట రామయ్యను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని శనివారం తెలిపారు. ఈ మేరకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశారు. వెంకటరామయ్య భార్య నాగదుర్గ బయ్యనగూడెం పంచాయతీ సర్పంచ్‌గా పనిచేసి గుర్తింపు పొందివున్నారు. ఈనేపథ్యంలో వెంకటరామయ్య నియామకం పంచాయతీతో పాటు పరిసర గ్రామాల్లో పార్టీ బలోపేతానికి దోహద పడగలదని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకటరామయ్య ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజ్యలక్ష్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తులతో కిక్కిరిసిన పారిజాతగిరి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో తెల్లవారుజామునుంచే ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, ఆరాధన, బాలబోగనివేదన, తోమాలసేవ, తీర్థప్రసాదగోష్టి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణతో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. సంక్రాంతి పండుగ సెలవులు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగప్రసాద్, కంది బాలకృష్ణరెడ్డి, వాసవి సాయినగేష్ పాల్గొన్నారు.

కుమారుడి నుంచి రక్షణ కల్పించాలని ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం: మానసిక స్థితి సరిగా లేని తన కుమారుడి నుంచి రక్షణ కల్పించాలని పట్టణానికి చెందిన వి.సత్యనారాయణ, పద్మశ్రీ దంపతులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపిన వివరాల ప్రకారం సత్యనారాయణ, పద్మశ్రీ దంపతుల మూడో సంతానం వి.పవన్‌శ్రీనివాస్‌కు మానసిక పరిస్థితి సరిగా లేదన్నారు. ఈ నెల 20వ తేదీన పవన్‌శ్రీనివాస్ ఇంట్లో ఉన్న బట్టలను కాల్చివేసి తమను భయభ్రాంతులకు గురిచేశాడని, అలాగే కత్తి తీసుకుని చంపుతానంటున్నాడని తమకు రక్షణ కల్పించాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు.

మహిళ అరెస్ట్

జంగారెడ్డిగూడెం: అక్రమంగా మద్యం కలిగి ఉన్న మహిళను అరెస్ట్ చేసినట్లు జంగారెడ్డిగూడెం ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మైసన్నగూడెం గ్రామానికి చెందిన జుత్తుగ మంగాదేవి అక్రమంగా రూ. 1050 విలువ చేసే 5 మద్యం బాటిళ్లు కలిగి ఉండటంతో అమెను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.